

హత్య కోణంలో దర్యాప్తు చేయాలి : భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణి కేసులో కీలక వ్యక్తి అయిన మాజీ టీటీడీ ఏవీఎస్‌ఓ సతీష్‌కుమార్ మరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం హత్య కోణంలో దర్యాప్తు చేయాలని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం వీడియో ప్రకటన విడుదల చేశారు. మృతదేహం రైల్వేట్రాక్‌పై కనిపించడంపట్ల అనుమానం వ్యక్తం చేశారు. గొడ్డలి పోటును గుండెపోటుగా మలిచిన వ్యక్తులు ఏమైనా చెయ్యగలరన్నారు. మిగతా సాక్షులు కూడా భయభ్రాంతులకు గురౌతున్నారని, వారందరికీ పోలీసు భద్రత కల్పించాలని కోరారు.

హత్య అయ్యుండచ్చు: హరిప్రసాద్

తిరుపతి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో కీలక సమాచారాన్ని సీఐడీకి అందించిన అధికారి మృతి యాదృచ్ఛికం కాదని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్ అన్నారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'విచారణాధికారులకు ఇప్పటికే ఆయన స్టేట్‌మెంట్ ఇచ్చారు. మరోసారి స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. హత్య అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి' అన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రవికుమార్ ప్రాణాలకు కూడా ప్రమాదం ఉందని హెచ్చరించారు. అతడిని పోలీసు కస్టడీలో సురక్షితంగా ఉంచాలన్నారు.

సాక్ష్యాలను తారుమారు చేసేందుకే..: రవి నాయుడు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో సాక్ష్యాలను తారుమారు చేసేందుకే మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ హత్య జరిగిందని, ఇది వైసీపీ పనేనని శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆరోపించారు. బాబాయి గొడ్డలిపోటు రహస్యాలు తెలిసిన ఒక్కొక్కరి కథ ఎలా ముగిసిందో పరకామణి కేసులో కూడా అదే చేస్తున్నారన్నారు. వంద శాతం నేరాన్ని జీరోసాక్ష్యం లేకుండా చేయడం వైసీపీ డీఎన్‌ఏలోనే ఉందన్నారు. వాస్తవాలను సమాధి చేసేందుకు వైసీపీ నేతలు ఇలాంటి చర్యలకు ఒడిగడుతున్నారని ఆరోపించారు.

రవికుమార్‌కు ప్రాణహాని వుంది: కిరణ్ రాయల్

తిరుపతి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసు ప్రధాన నిందితుడు రవికుమార్‌కు ప్రాణహాని ఉందని తిరుపతి జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. వెంటనే ఆయన్ను పోలీస్ కస్టడీకి తీసుకోవాలని కోరారు. సతీష్‌కుమార్‌ది ఆత్మహత్య, హత్యా అనేది తెలియాల్సివుందన్నారు. పరకామణి కేసులో వీరిద్దరే కీలకమన్నారు. రవికుమార్‌ను 2తేదీ వరకు పోలీసు అదుపులో ఉంచితే విషయాలన్నీ బయటపడతాయన్నారు.

నా పేరు చెప్పమని బెదిరించడంతో ఆత్మహత్య : భూమన

తిరుపతి(జీవకోన), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విచారణలో భయపెట్టి, బెదిరించిన కారణంగానే పరకామణి కేసులో ఫిర్యాదుదారుడైన సతీష్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. శుక్రవారం తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, సతీష్‌కుమార్‌చేత బలవంతంగా తన పేరు చెప్పించాలని ఒత్తిడి చేశారని ఆరోపించారు. ప్రభుత్వ తప్పులు ఎత్తిచూపుతున్న కారణంగానే ఈ కేసులో తనను ఇరికించాలని కుట్ర చేస్తున్నారని కరుణాకరరెడ్డి ఆరోపించారు. ఈ కోణంలో సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.


సతీష్‌కుమార్ మృతదేహం

చంపేశారా?

- శ్రీవారి 'పరకామణి' కేసులో సీఐడీ విచారణకు వస్తున్న మాజీ ఏవీఎస్వో అనుమానాస్పద మృతి
- గాయాలను బట్టి హత్యగా అనుమానిస్తున్న పోలీసులు
- ఈ కేసులో ఫిర్యాదు చేసింది.. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నదీ సతీష్‌కుమారే

పరకామణిలో చోరీని పసిగట్టి ఫిర్యాదు చేసిన పోలీసు అధికారి సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతి తీవ్ర సంచలనంగా మారింది. తిరుపతిలో సీఐడీ విచారణకు వచ్చే క్రమంలో తాడిపత్రి సమీపంలో రైలుపట్టాల పక్కన ఆయన మృతదేహం పడుంది. ఆయన మృతదేహం మీద ఉన్న గాయాలను బట్టి హత్య కావొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో కేసు విచారణకు హాజరవుతున్న వారిలోనూ భయాందోళనలు పెరుగుతున్నాయి. పరకామణి కేసులో రాజీచేసిన తీరును హైకోర్టు తప్పుపట్టిన నేపథ్యంలో మొదలైన సీఐడీ విచారణలో ఏ నిజాలు బయటపడతాయో అనే ఆందోళనతోనే సతీష్‌కుమార్‌ను అంతమొందించారా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ మరణం రాజకీయ వివాదంగా మారుతోంది. హత్య అని కొందరూ, అనుమానమని మరికొందరూ, తమపై కుట్ర అని ఇంకొందరూ భిన్న వాదనలతో మీడియా ముందుకు వస్తున్నారు. ఇప్పటికే ఒకసారి సతీష్‌కుమార్‌ను సీఐడీ విచారించింది. మరోమారు విచారణకు ఆయన హాజరవుతున్న సమయంలో ఈ సంఘటన జరగడం అనుమానాలకు బలం ఇస్తోంది. ఈ వార్త తెలియగానే సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ ఆగమేఘాలపై సంఘటనాస్థలికి ప్రయాణమయ్యారు.

సౌమ్యుడు సతీష్‌కుమార్

- టీటీడీలో ఏడేళ్లకు పైగా విధులు
- గుర్తు చేసుకుంటున్న ఉద్యోగులు



తిరుమల, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అధికారిగా చురుగ్గా సుదీర్ఘకాలం సేవలందించిన సతీష్‌కుమార్ మృతి టీటీడీ ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారిలా కాకుండా టీటీడీ ఉద్యోగిలానే అయన వ్యవహరించేవారని గుర్తు చేసుకుంటున్నారు. తన సెక్టార్ కాకపోయినప్పటికీ ఎక్కడ సమస్య ఎదురైనా సతీష్‌కుమార్ ఇట్టే వాలిపోయి సేవలందించేవారని అంటున్నారు. విధుల్లో ఆయన భక్తులతో ఎంతో సౌమ్యంగా వ్యవహరించేవారు. శ్రీవారి పరకామణి లెక్కింపు చోరీ కేసులో ఈయన ఫిర్యాదుదారుగా ఉండడంతో తీవ్రమైన చర్చ జరుగుతోంది.


భార్య మమత, కుమారుడు తారా సతీష్, కుమార్తె లోహితాశ్వాతో సతీష్‌కుమార్ సెల్ఫీ (ఫైల్ ఫొటో)


ఘాట్‌రోడ్డులో తమను అనుమతించాలని నిరసన వ్యక్తం చేస్తున్న ద్విచక్రవాహనదారులకు నమస్కరించి వెనక్కి వెళ్లిపోవాలని కోరుతున్న ఏవీఎస్వో సతీష్ (ఫైల్ ఫొటో)

విజిలెన్స్‌లో ఏడేళ్లు

కర్నూలు జిల్లాలోని పత్తికొండకు చెందిన వై సతీష్‌కుమార్ రిజర్వ్ ఎస్ఐగా విధుల్లో చేరారు. 2017 జూలై 27న టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఇన్స్పెక్టర్‌గా వచ్చారు. తొలుత శ్రీవారి ఆలయం, తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్ వీఐగా 2022 ఆగస్టు 1వరకు విధులు నిర్వహించారు. ఆ తర్వాత మాతృసంస్థకు బదిలీ అయ్యారు. సీఐగా పదోన్నతి లభించింది. దీంతో నెల వ్యవధిలోనే 2022 సెప్టెంబరు 27న తిరిగి శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కింపు పరకామణి ఏవీఎస్వో (అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్)గా నియమితులయ్యారు. 2023లో పరకామణి దొంగతనం కేసు బయటపడేవరకు అక్కడే ఏవీఎస్వోగా ఉన్నారు. ఆ తర్వాత సెక్టారు3, లగేజీ ఏవీఎస్వోగా విధులు చేపట్టారు. అదే ఏడాది చివరిలో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఏవీఎస్వోగా బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది జూన్ 4వరకు పనిచేశారు. మొత్తంగా పలు సెక్టార్లలో ఏడేళ్ల ఆరునెలల పాటు విధులు నిర్వహించారు.

ఎవరికి ఏ పదవులు?

టీడీపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పదవులకు నాయకుల మధ్య తీవ్రపోటీ

- మండల కమిటీల నియామకం పూర్తి
- ఇక జిల్లా కమిటీలపైనే అధిష్ఠానం కసరత్తు
- వచ్చే వారంలో ప్రకటించే అవకాశం

చిత్తూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కమిటీలో ఎవరెవరికి చోటు దక్కుతుందా అని తెలుగుదేశం వర్గాలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాయి. తమకు ఫలానా పదవి కావాలని ఆ మధ్య త్రిసభ్య కమిటీని కోరిన నాయకులు కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటూనేవున్నారు. సాధారణంగా అధికార పార్టీలో జిల్లా అధ్యక్ష పదవికి డిమాండ్ అధికంగా ఉంటుంది. ప్రస్తుతానికి పార్లమెంటు నియోజకవర్గాన్ని ప్రామాణికంగా తీసుకుని కమిటీలను వేస్తున్నారు. వైజాగ్‌లో జరుగుతున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నేటితో ముగియనుంది. వాస్తవానికి ఈ సమ్మిట్ హడావిడితోనే జిల్లా కమిటీల కసరత్తును వాయిదా వేశారు. వచ్చే వారంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పోస్టులతో పాటు జిల్లా కమిటీని ప్రకటించే అవకాశాలున్నాయి.

● చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో కుప్పం, చిత్తూరు, నగరి, చంద్రగిరి నియోజకవర్గాల్లో కమ్మ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలే ఉండడంతో ఈసారి అధ్యక్ష పదవి ఆ సామాజికవర్గానికి రాదని సీనియర్లు అంచనా వేస్తున్నారు. ఒకవేళ ఆ వర్గానికి ఇవ్వాల్సి వచ్చినా కార్యదర్శితో సరిపెట్టొచ్చని భావిస్తున్నారు. ఒకవేళ అవకాశం ఉంటే ఎస్సీ నియోజకవర్గాల నుంచి నేతలను ఎంపిక చేయాలని ఆలోచిస్తున్నారు. పూతలపట్టు నియోజకవర్గం నుంచి ఎస్సీ జయప్రకాష్, జీడీనెల్లూరు నుంచి భీమనేని చిట్టిబాబు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వీరిలో జయప్రకాష్‌కు లోకల్ ఎమ్మెల్యే మురళీమోహన్ సపోర్టు ఉండగా, చిట్టిబాబుకు స్థానిక ఎమ్మెల్యే థామస్ సపోర్టు లేదు. 'ఎమ్మెల్యేల సపోర్టు' అనే అంశాన్ని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటుందా.. లేదా.. అనేది చూడాల్సి వుంది. ● బీసీ వర్గాలకు ఇవ్వాల్సి వస్తే ఇప్పటికే అధ్యక్షుడిగా ఉన్న సీఆర్ రాజన్, నగరి నియోజకవర్గానికి చెందిన షణ్ముగరెడ్డి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ వన్నియకుల క్షత్రియ సామాజికవర్గానికే చెందినవారే. ఆ మధ్య వీరిద్దరి పేర్లతో అధిష్ఠానం ఐవీఆర్ఎస్ సర్వే కూడా చేసింది. వీరిలో సీఆర్ రాజన్‌కు వన్నికుల క్షత్రియ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పోస్టు ఉండడంతో మరో పోస్టు ఇస్తారా.. అనే అంశంపై కూడా స్పష్టత లేదు. ● ఎస్సీ వర్గానికి ఇవ్వాల్సి వస్తే పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈయన అధ్యక్ష పదవి కావాలని త్రిసభ్య కమిటీకి విన్నవించడంతో పాటు ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. ఆయా సమస్యల మీద మీడియాలో పార్టీ గళాన్ని విప్పుతూ యాక్టివ్‌గా ఉంటున్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీకి అవకాశమున్నా, ఆయన తిరస్కరించినట్లు సమాచారం. ● బలిజ సామాజికవర్గం విషయానికొస్తే..చిత్తూరుకు చెందిన కాజూరు బాలాజీ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించిన ఆరుగురు ఆశావహుల గ్రూపులో ఈయన కూడా ఉన్నారు. బలిజ కోటాలో తనకు టికెట్ వస్తుందని ఆశించారు. ఇప్పుడు జిల్లా అధ్యక్ష పదవి కోసం త్రిసభ్య కమిటీని కోరడంతో పాటు ఎమ్మెల్యేలతో కూడా సిఫార్సు చేయిస్తున్నారు. ఈయనతో పాటు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ గట్టిగా అడగలేదు, కానీ అధ్యక్ష పదవి ఇస్తే చేస్తానని త్రిసభ్య కమిటీతో చెప్పి ఉన్నారు. కఠారి హేమలత విషయానికొస్తే ఆమె ఇప్పుడు చుడా ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. మేయర్ పదవిని ఆశిస్తున్నారు కాబట్టి జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేయనట్లు కనిపిస్తోంది. ● తెలుగు యువత, తెలుగు మహిళ అధ్యక్ష పోస్టులు కూడా అధ్యక్ష- కార్యదర్శి పదవులు పొందిన సామాజికవర్గాలు కాకుండా మిగిలిన వర్గాలకు ఇస్తుంటారు. పాకాలకు చెందిన కిశోర్, గుడిపాలకు చెందిన తలపనేని పవన్ కమ్మ కోటాలో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మహిళా అధ్యక్షురాలి పదవి కోసం ఎస్సీ కోటాలో నగరి నియోజవర్గానికి చెందిన మీరా పేరు వినిపిస్తోంది. ఈమె, ప్రస్తుత అధ్యక్షురాలు కార్జాల అరుణతో పాటు యువగళం పాదయాత్ర సమయంలో చీర తీసుకుని రోజా ఇంటికి వెళ్లగా.. పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించిన విషయం తెలిసిందే.

కుప్పం టీడీపీ నేతలపై రెండు కేసుల కొట్టివేత



చిత్తూరు కోర్టు వద్ద టీడీపీ నేతల సంతోషం

రామకుప్పం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్ళ క్రితం కుప్పం నియోజకవర్గ టీడీపీ నేతలపై నమోదు చేసిన రెండు హత్యాయత్నం కేసులను చిత్తూరు జిల్లా కోర్టు శుక్రవారం కొట్టివేసింది. 2022 నవంబరు 24న విపక్ష నేత హోదాలో చంద్రబాబు కుప్పం నియోజవర్గంలో పర్యటించారు. ఆయనకు స్వాగతం పలుకుతూ రామకుప్పం మండలం కొంగనపల్లె పంచాయతీ కొళ్ళపల్లెలో టీడీపీ శ్రేణులు స్వాగత తోరణాలు కట్టారు. అదే సమయంలో వైసీపీ శ్రేణులు తమ పార్టీ తోరణాలు కట్టి కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. చంద్రబాబు కొంగనపల్లెలో పర్యటిస్తూ కాసేపట్లో కొళ్ళపల్లెకి వస్తున్నారనగా వైసీపీ శ్రేణులు టీడీపీ శ్రేణులపై రాళ్ళ వర్షం కురిపించాయి. వారిని కట్టడి చేయాల్సిన పోలీసులు టీడీపీ శ్రేణులనే తరిమికొట్టారు. ఈ నేపథ్యంలో స్థానిక వైసీపీ కార్యకర్తలు రాధప్ప, గౌరమ్మ పిర్యాదులతో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్‌లతో పాటు నియోజకవర్గంలోని 34మంది నేతలపై హత్యాయత్నంతో పాటు పలు సెక్షన్లపై రెండు కేసులు నమోదయ్యాయి. అప్పటి రాళ్ళబూదుగూరు ఎస్ఐ మునస్వామి ఫిర్యాదు మేరకు 14మందిపై హత్యాయత్నంలో పాటూ పలు సెక్షన్లతో మరో కేసు నమోదు చేశారు. కుప్పం పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన చంద్రబాబుకు వీడ్కోలు పలికి వస్తున్న మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, నూలుకుంటకు చెందిన సుబ్బు, శాంతిపురం మండలానికి చెందిన ఆర్ఎస్ మణి, కుప్పం మండలానికి చెందిన ముఖేష్, మంజు, అప్పులను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అప్పట్లో వారు నెల రోజులకు పైగా జైల్లో ఉన్నారు. ఈ కేసుల్లో ఉన్న వారు ఏడాది క్రితం వరకు కుప్పం కోర్టుకు హాజరయ్యేవారు. ఏడాది నుంచి వాయిదాలకు చిత్తూరు కోర్టుకు హాజరవుతున్నారు.ఈనెల 3న రెండు కేసులు జిల్లా కోర్టులో ట్రయల్‌కు వచ్చాయి. 3, 4, 5, 6, 7, 10, 11తేదీల్లో టీడీపీనేతలు కోర్టుకు హాజరయ్యారు.రాధప్ప, గౌరమ్మ పిర్యాదులతో నమోదైన రెండు కేసుల్లో నేతలపై మోపిన నేరారోపణలు రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి కొట్టివేసినట్టు టీడీపీ నేతలు తెలిపారు. శుక్రవారం కోర్టుకు హాజరైన వారిలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, సీఎం పీఏ మనోహర్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి,కడా పీఏసీ మెంబరు రాజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, తెలుగుయువత నియోజకవర్గ ప్రధానకార్యదర్శి శంకర్‌చలం, టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు నందిగం ఉదయ్‌కుమార్, మాజీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథనాయుడు, ఆర్ఎస్‌మణి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రెస్కో డైరెక్టరు విజయ్‌కుమార్, నేతలు ఏఎంసీ నాగరాజు, వేలు, బాలకృష్ణ, మణి, ఎల్లప్ప, సుబ్బు తదితరులున్నారు.కేసులను కొట్టవేయడంలో కీలక పాత్ర వహించిన చిత్తూరు న్యాయవాదులకు, అండగా నిలిచిన టీడీపీ నియోజకవర్గ నేతలకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



బాలల దినోత్సవ సందర్భంగా కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల ఉత్సాహ ప్రదర్శన
- వెదురుకుప్పం,ఆంధ్రజ్యోతి

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.76 కోట్లు

ఐరాల(కాణిపాకం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ హుండీకి రూ.1,76,77,666 ఆదాయం లభించింది. స్వామి కానుకలను శుక్రవారం ఆస్థాన మండపంలో లెక్కించారు.1357 యూఎస్, 235 ఆస్ట్రేలియా, 5 కెనడా డాలర్లు, 15 యూరోలు, 35ఇంగ్లాండ్ పౌండ్లు, 53 గ్రాముల బంగారు, 790 గ్రాముల వెండితో పాటు గో సంరక్షణ హుండీ ద్వారా రూ.15,103, నిత్యాన్న ప్రసాద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.21,673 లభించాయి.ఈ ఆదాయం 28 రోజుల్లో సమకూరింది.ఈవో పెంచలకిషోర్, డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ఎస్వీ.కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్, ధనంజయ, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.





బీజేపీ సంబరాలు

బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో చిత్తూరులో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర నాయుడి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహ సర్కిల్‌లో బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.బిహార్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ మరోసారి విజయకేతనం ఎగురవేయడంతో మోదీపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందన్నారు.బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, రవికుమార్, నాయకులు సత్యభామ, దామోదర్, బాబు, షణ్ముగం, రాజేంద్రన్, భానుప్రకాష్, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



అవార్డు గెలుచుకున్న అమరరాజ బృందం సభ్యులు

13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్న 'అమరరాజ'

రేణిగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లోని తైపీ నగరంలో జరిగిన 50 వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్ ఐసిక్యూసిసి- 2025లో అమరరాజ తరపున పాల్గొన్న 13 బృందాలు 13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్నాయి. 14 దేశాలు నుంచి 884 బృందాలు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అమరరాజ తరపున 13 బృందాలు గోల్డ్ అవార్డును సాధించాయి. అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ ఈఎంయాల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ వేదికపై అమరరాజ సాధించిన ఈ గౌరవం అమర రాజా పరిశ్రమలో తయారయ్యే పరికరాల నాణ్యతకు గుర్తింపు అని పేర్కొన్నారు. 13 బంగారు అవార్డులు గెలుచుకున్న బృందాలకు అమరరాజ చైర్మన్ గల్లా జయదేవ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,129

తలనీలాలు సమర్పించినవారు: 21,026



◆ కూటమి పాలనలో

పంచాయతీ ఖజానా గలగల

✳ వైసీపీ హయాంలో భవనాలకు అవినీతి కొలతలు ✳ భారీగా తగ్గిన ఆస్తి పన్ను రాబడి

✳ కూటమి ప్రభుత్వంలో రీ వెరిఫికేషన్‌తో వెలుగులోకి ✳ గతేడాదితో పోలిస్తే పెరిగిన రూ.10 కోట్లు



● తిరుచానూరు సమీపంలో ఓ స్టార్ హోటల్ 35వేల చదరపు అడుగుల్లో ఉంది. రికార్డుల్లో మాత్రం 8వేల చదరపు అడుగులు మాత్రమే చూపించారు. రూ.4.23లక్షల పన్ను కట్టించుకున్నారు. కూటమి ప్రభుత్వ ఆదేశాలమేరకు పంచాయతీ అధికారులు ఇటీవల అదే హోటల్ భవన విస్తీర్ణాన్ని రీవెరిఫికేషన్‌చేస్తే 35వేల చదరపు అడుగుల్లో ఉన్నట్లు తేలింది. దీంతో రూ.9.71లక్షలు ప్రాపర్టీ ట్యాక్సు కట్టించారు. అంటే రూ.5 లక్షలకు పైగా పంచాయతీకి ఆదాయం వచ్చింది.

● ఏర్పేడు వద్ద ఓ ఇండస్ట్రీకి రూ.2.49 లక్షలు మాత్రమే ప్రాపర్టీ ట్యాక్సు కట్టించుకున్నారు. తీరా రీవెరికేషన్‌లో అదే పరిశ్రమ రూ.4.77 లక్షలు చెల్లించింది. ● గూడూరు వద్ద ఓ ప్రైవేటు పరిశ్రమ రూ.3.45 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.1.02 లక్షలే కట్టించుకున్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీల పరిధిలోని భవనాల కొలతల్లో స్థానిక నేతలతో కలిసి కొందరు సిబ్బంది చేతివాటం చూపారు. దీనివల్ల పంచాయతీలకు ఆస్తి పన్ను రాబడి గణనీయంగా తగ్గింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆన్‌లైన్ ద్వారా ఆస్తిపన్ను చెల్లించే విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో ఆస్తి పన్ను వివరాలను ఆయా పంచాయతీల్లో ఆన్‌లైన్ చేశారు. ఆస్తి పన్నుతోపాటు వివిధ పన్నులను వరికి వారే చెల్లించుకునే సదుపాయం కల్పించారు. దీనికి తోడు ఆయా గ్రామ పంచాయతీల్లోని వాణిజ్యభవనాల (ప్రైవేట్ హోటల్స్, ఇండస్ట్రీస్, ఆస్పత్రులు) కొలతలు రీవెరిఫికేషన్ చేశారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో తక్కువ కొలతలు చూపారన్న విషయం వెలుగు చూసింది. తద్వారా దాదాపు రూ.10కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి పడిన విషయం బయటకు వచ్చింది. ఇలా తొట్టంబేడు, తిరుపతి రూరల్, వరదయ్యపాలెం తదితర మండలాల్లో మొత్తం వాణిజ్య భవనాలు, ఇళ్ల కొలతలు రీవెరిఫికేషన్ చేయగా దాదాపు రూ.10కోట్ల మేరప్రస్తుతానికి అదనపు ఆదాయం చేకూరింది. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ అధికారులు స్థానిక వైసీపీ నేతల సిఫార్సులు, ఒత్తిళ్లకు తలొగ్గి సరిగా కొలతలు వేయకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

పెరిగిన ఆస్తి పన్ను రాబడి



పీఆర్ కమిషనరు కృష్ణతేజ, కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జరిపిన రీ వెరిఫికేషన్‌తో రూ.పది కోట్ల మేర అదనపు ఆదాయం లభించింది. పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెడుతూ ఆస్తి పన్ను చెల్లించే విధానాన్ని ఆన్‌లైన్ చేశారు. యూపీఐ ద్వారా పన్నుచెల్లించవచ్చు. ప ంచాయతీ సిబ్బందికి ఎక్కడా నగదు రూపంలో పన్ను చెల్లించవద్దు.

- సుశీలాదేవి, డీపీవో



వేదవిద్యార్థులకు కొత్త వస్త్రాలు

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. ఏడాదికోసారి వేద పాఠశాలలోని విద్యార్థులకు టీటీడీ వస్త్రాలను పంపిణీ చేయడం ఆనవాయితీ. 4 పంచెలు, ఒక దుప్పటి చొప్పున 380 మంది విద్యార్థులకు అందజేశారు. ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శివసుబ్రహ్మణ్య అవధాని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ఆనంద్‌సాయి





సుధీర్‌రెడ్డి - ఆనంద్‌సాయి, వాసుకీ

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం టీటీడీ బోర్డు సభ్యుడు, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి, ఆయన సతీమణి వాసుకి దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి 15వ పెళ్లి రోజు సందర్భంగా స్వామికి వస్త్రం సమర్పించి దర్శనం చేసుకున్నారు.

కొనసాగుతున్న 'నృత్య వాహిని'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో మూడు రోజులుగా చేపట్టిన నృత్య వాహిని కార్యక్రమం కొనసాగుతూ ఉంది. థాయ్‌లాండ్‌కు చెందిన నృత్య కారులు అక్కడి స్థానిక సంప్రదాయ నృత్యంతో అలరించారు. గుజరాత్‌కు చెందిన కళాకారులు గర్బా నృత్యంతో ఆకట్టుకున్నారు. వీరితో పాటు పలు ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులను ప్రదర్శించారు. వీరిని నృత్య వాహిని నిర్వాహకులు సత్కరించారు. శనివారం ఈ కార్యక్రమం ముగియనుంది.





రింగురోడ్డులో బైక్, కారు ఢీ

● ఒకరికి గాయాలు



తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల రింగురోడ్డులో శుక్రవారం బైక్, కారు ఢీకొని ఒకరు గాయపడ్డారు. క్షేత్రపాలకుని ఎదురుగా ఏర్పాటు చేసిన కొత్త రోడ్డులో నుంచి రింగురోడ్డులోకి వస్తున్న బైక్, ఎదురుగా వచ్చిన ఇన్నోవా కారు ఢీకొన్నాయి. బైక్‌పై ఉన్న తిరుపతికి చెందిన వంశీకృష్ణారెడ్డి ఎడమకాలుకి గాయమైంది. అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు.

పదిలం పదిలం పసిహృదయం

● చిన్నారుల గుండె జబ్బులపై అవగాహన పెంచుకోవాలన్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'దేశంలో వెయ్యి మంది చిన్నారుల్లో 8 మందికి పుట్టుకతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి. వీరిలో 90 శాతం మందికి అవసరాన్ని బట్టి 3 నుంచి 4 ఆపరేషన్లు చేయాల్సి వస్తోంది. అందుకని ప్రతి ఒక్కరూ చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన కలిగి ఉండాలి' అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో పదిలం పదిలం పసిహృదయం, చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన పేరిట స్విమ్స్‌లోని ఓపీడీ బ్లాక్‌లో పోస్టర్ల ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పురిటి బిడ్డలకు వచ్చే గుండె జబ్బులను దృష్టిలో పెట్టుకొని దానిపై ప్రతీ ఒక్కరికీ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మా తల్లిదండ్రులు సుశీలమ్మ, శ్రీనాదరావు పేరిట శ్రీనాథ సహృదయ సాహితి సంస్థను స్థాపించి అందులో భాగంగా పదిలం పదిలం పసిహృదయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో చిన్నారులకు గుండె జబ్బులు ఎందుకు వస్తాయి, దానిని ఎలా గుర్తించాలి, ఎలాంటి ఆపరేషన్లు చేస్తారు అనే విషయాలను స్పష్టంగా వివరించామన్నారు. పోస్టర్ల ద్వారా చిన్నపిల్లల గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు పోస్టర్ల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణ చేతుల మీదుగా పుస్తకాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



పసిపిల్లల గుండె జబ్బులకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్ తదితరులు

15కేజీల గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్టు



నిందుతుడు, గంజాయిని చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ హరిప్రసాద్ శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు గురువారం బీఎన్‌కండ్రిగలో ప్రధాన రహదారిలో ఉన్న ఏఎంసీ చెక్‌పోస్టు దగ్గర తనిఖీలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వ్యక్తి తిరుపతికి వెళ్లడానికి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ నుంచి నుంచి ఆటోలో రాగా తనిఖీ చేశారు. అతడి నుంచి 15కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. తహసీల్దార్ శ్రీదేవి, వీఆర్‌ఓలు పంచనామా చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌ఐ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో శ్రీసిటీ ఎండీ



సత్యవేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థికాభివృద్ధిలో జపాన్ సంస్థల పెట్టుబడులు విస్తరిస్తూ భారత్ -జపాన్ పారిశ్రామిక బంధం మరింత బలపడుతోందని ఇందులో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో భారత్-జపాన్ భాగస్వామ్యం సెషన్‌లో రవీంద్ర సన్నారెడ్డి ప్యానెలిస్టుగా మాట్లాడారు. జపాన్ పెట్టుబడిదారుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందన్నారు. శ్రీసిటీ భారతదేశంలో రెండో అతి పెద్ద జపనీస్ ఇండస్ట్రీయల్ టౌన్‌షిప్‌గా ఎదిగిందన్నారు. 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన జపాన్ ఎన్‌క్లేవ్‌లో 35కుపైగా కంపెనీలు పని చేస్తున్నాయని తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా శ్రీసిటీ స్టాల్

సదస్సులో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యూహాత్మక స్థానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ప్రదర్శించే ఆకర్షణీయ డిజిటల్ ప్రదర్శనలు, త్రీడీ మోడళ్లతో పలువురి దృష్టిని ఆకర్షించింది. ఎఫ్ఎంసీజీ వస్తువులు, వివిధ ఎయిర్ కండిషనర్ బ్రాండ్లు, ఆటో మొబైల్ భాగాలు, వీల్‌చైర్లు, ఇసుజు వాహనాలతో సహా మేడ్, శ్రీసిటీ ఉత్పత్తుల ప్రదర్శన ప్రతినిధులను

శాస్త్రీయ ప్రతిభను గుర్తించడం అకాడమీ బాధ్యత

● భారత శాస్త్ర అకాడమీ సదస్సు ప్రారంభోత్సవంలో రాఘవన్ వరదరాజన్





మాట్లాడుతున్న రాఘవన్ వరదరాజన్ - ఐసర్‌లో విద్యార్థులకు నూతన ఆవిష్కరణలపై వివరిస్తున్న శాస్త్రవేత్త

ఏర్పేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని జాతీయ విద్యా సంస్థ ఐసర్‌లో భారతశాస్త్ర అకాడమీ 91వ వార్షిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ రాఘవన్ వరదరాజన్ మాట్లాడుతూ.. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఒక చురుకైన సమగ్ర శాస్త్రీయ సంస్థగా ఎదిగి శాస్త్రీయ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలతో ముందంజలో ఉందన్నారు.శాస్త్రీయ ప్రతిభను గుర్తించడం అకాడమీ ప్రధాన బాధ్యత అన్నారు. ఈ ఏడాది జనవరి 1న కొత్త కౌన్సిల్ పదవీ బాధ్యతలు స్వీకరించిందని, అకాడమీ 91వ సంవత్సరంలోకి ప్రవేశించిందన్నారు.ప్రచురణ రంగంలో ఆకాడమీ 11జర్నల్స్‌లో మొత్తం 1,369 పరిశోధనా వ్యాసాలు ప్రచురించిందన్నారు.ఈ ఓపెన్‌యాక్సెస్ జర్నల్స్‌కు ప్రపంచవ్యాప్తంగా 46లక్షలకు పైగా డౌన్‌లోడ్స్ రావడం మనకు పెరుగుతున్న గుర్తింపు చూపిస్తోందన్నారు. సమ్మర్ రీసెర్చ్ సీఈవో శివకుమార్ కల్యాణ్‌రామన్ కూడా పరిశోధనలపై ప్రసంగించారు.

బయో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

ఐసర్‌లో ఏర్పాటు చేసిన బయోసైన్స్ ల్యాబ్‌ను గురువారం రాత్రి ఏఎన్‌ఆర్ఎఫ్ సీఈవో శివకుమార్ కల్యాణ రామన్ ప్రారంభించారు.కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఇది ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్‌సింగ్ క్లోహి తదితరులు పాల్గొన్నారు.



ఐసర్‌లో ఏర్పాటు చేసిన నీతికథలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యువ శాస్త్రవేత్తలకు ఆహ్వానం

తిరుపతి ఐసర్‌లో జరుగుతున్న భారత శాస్త్ర అకాడమీసదస్సు యువ శాస్త్రవేత్తలకు ఎంతో ఉపయోగకరంగా వుంది. దేశవ్యాప్తంగా వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తల నుంచి ఎన్నో విజ్ఞాన పరిజ్ఞానాలు యువ శాస్త్రవేత్తలు తెలుసుకోవడానికి వీలుగా వుంది.

- ఎస్వీ చలపతిరావు,
నేషనల్ సెంటర్ ఫర్ఎర్త్ సైన్స్ స్టడీస్, త్రివేండ్రం.

పరిశోధనల ఉపయోగంపై చర్చ

దేశంలో జరుగుతున్న పరిశోధనలు పబ్లిక్‌కు ఏ విధంగా ఉపయోగపడతాయో అనే అంశంపై పలువురు శాస్త్రవేత్తలు చర్చలు జరిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో మెలకువలపై చర్చలు జరిగాయి. కూరగాయలపంటలపై వస్తున్న వ్యాధులను అరికట్టేందుకు ఎలాంటి పరిశోధనలు చేస్తే బాగుంటుందనే ఎన్నో విషయాలను తెలుసుకున్నాం.

- డాక్టర్ నరసింహ,
వైరాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్,
డీన్ ఎస్వీయూ,తిరుపతి

సదరన్ డిస్కంలో పలువురికి పదోన్నతులు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కంలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ శివశంకర్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈఈ సోమశేఖర్‌రెడ్డికి ఎస్ఈగాను, డిప్యూటీ ఈఈ చంద్రానాయక్‌ను ఈఈగాను, అకౌంట్స్ ఆఫీసర్లుగా వున్న శ్రీధర్, నరేంద్రనాయుడును సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించారు. అలాగే ఏఈలుగా వున్న 25 మందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగాను, ఏఏవోలుగా వున్న ఏడుగురిని అకౌంట్స్ ఆఫీసర్లుగాను, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా వున్న 19 మందిని ఏఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో నమోదై.. వారి కుటుంబంలోని వారి సంతాన ఓటరును అనుసంధానంచేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఇన్‌చార్జి జేసీ మౌర్య అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ2025పై విజయవాడ నుంచి చీఫ్ ఎలక్ట్రోల్ అధికారి జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జేసీ మౌర్య, ఇతర అధికారులు హాజరయ్యారు. సంతాన ఓటరు అనుసంధానం ప్రక్రియపై సమీక్షించారు. బీఎల్వోలు ఇంటింటికి తిరిగి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య,అర్బన్ తహసీల్దారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ చైర్మన్‌కు డీడీ అందజేస్తున్న భూషణ్

తిరుమల, నవంబరు14(ఆంధ్ర జ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. విజయవాడకు చెందిన మోనిష్ వెంకట సత్యప్రకాష్ తరపున భూషణ్ తిరుమలలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

'గ్రేటర్' విలీనానికి గాంధీపురం విముఖత

తిరుపతిరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో గాంధీపురం గ్రామపంచాయతీని విలీనం చేయొద్దంటూ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేశారు. సర్పంచ్ ఎం.లక్ష్మీశివ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై విలీనం వద్దు..గ్రామపంచాయతీనే ముద్దు అంటూ నినాదాలు చేశారు. గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేదలపై పన్నుల భారం మరింతగా పెరుగుతుందని, సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మఠంభూములకు విలువని నిర్ధారించి రిజిస్ట్రేషన్‌కి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు అభిప్రాయ తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి లతాశ్రీకి అందజేశారు.

పెన్షనర్ల సంఘం అధ్యక్షుడి మృతి



మునస్వామి (ఫైల్ ఫొటో)

పాకాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాకాల యూనిట్ అధ్యక్షుడు పిఆర్ మునస్వామి (79) శుక్రవారం ఉదయం మృతిచెందారు. ఈయన మృతికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.జయరామనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు, పాకాల యూనిట్ నేతలు కుప్పస్వామినాయుడు, కె.రామ్మూర్తి, జి.రామయ్య, కెఎస్ తులసీరామన్, పెన్షనర్లు సంతాపం తెలిపారు.

డివైడర్ దాటుకుని వచ్చి బైక్‌ను ఢీకొట్టిన కారు

● మహిళ మృతి



బైక్‌ను ఢీకొన్న కారు వద్ద గుమికూడిన ప్రజలు

మీరా మృతదేహం

గంగాధరనెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - పుత్తూరు రహదారిలో ఓ ఇన్నోవాకారు డివైడర్‌ను దాటుకుని వెళ్లి మరొక రోడ్డులో ఎదురుగా బైక్‌ను ఢీకొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్సల కోసం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఒక మహిళ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో వ్యక్తి చికిత్స పొందుతున్నారు. గంగాధరనెల్లూరు హెడ్‌కానిస్టేబుల్ మణి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కుండలూరు గ్రామం రామర్‌కోయిల్ వీధికి చెందిన రఘు (59) తాపీమేస్త్రీ పనిచేస్తుండగా, ఆయన మరదలు మీరా (50) చిత్తాల్ (కూలీ) పని చేస్తుండేవారు. తమిళనాడు నుంచి చిత్తూరు రూరల్ మండలం మీదుగా వీరు చిత్తూరు టౌన్‌లో భవన నిర్మాణపనులకుగాను బైక్‌పై శుక్రవారం ఉదయం బయలుదేరారు. మార్గమధ్యంలో గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ సుందరరాజురం హెరిటేజ్ పాల డెయిరీ సమీపంలోకి రాగానే చిత్తూరు నుంచి గంగాధరనెల్లూరు వైపు వస్తున్న ఇన్నోవాకారు అదుపుతప్పి పక్కనున్న డివైడర్ దాటుకుని మరోవైపు ఉన్న రోడ్డులో ఎదురుగా బైక్‌పై వస్తున్న రఘు, మీరాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న రఘు, మీరాలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు గాయపడ్డవారిని పరీక్షించి మీరా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. రఘు పరిస్థితి విషమంగా ఉందని, వైద్యసేవలు అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గాయపడ్డ రఘు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చెప్పారు. ప్రమాదానికి కారణమైన ఇన్నోవాకారుకు సంబంధించిన వారి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

బండను పేల్చడంతో తెగిన వైర్లు

● జీడీనెల్లూరులో 2గంటలకు పైగా విద్యుత్ అంతరాయం

గంగాధరనెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొలంలోని బండను మందుగుండుతో పేల్చడంతో పక్కనున్న విద్యుత్ స్తంభాల్లోని వైర్లు తెగిపోయి రెండుగంటలకుపైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన వైనమిది. గంగాధరనెల్లూరు సమీపంలోని ముక్కళత్తూరు మలుపు వద్ద ఓ పొలంలో బండరాయిని తొలగించడానికి గాను మందుగుండు పెట్టి శుక్రవారం సాయంత్రం పేల్చారు. దీంతో ఒక్కసారిగా పెద్దఎత్తున శబ్దం వచ్చింది. మందుగుండు వాడి బండరాయి పేల్చడం వల్ల ఆ రాయి పగిలిపోయి వాటి ముక్కలు సమీపంలోని విద్యుత్‌వైర్లకు తగలడంతో అవి తెగిపోయాయి. దీంతో గంగాధరనెల్లూరులో విద్యుత్ సరఫరాకు శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి రెండు గంటల పాటు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాలో ఆటంకానికి కారణం ఏంటనేది కొంతసేపు వరకు అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.చివరకు మందుగుండు పేల్చిన పొలం వద్దకు వెళ్లి అక్కడున్న వ్యక్తులను విచారిస్తే తమకేం తెలియదని దాటవేసినట్లు తెలిసింది.చివరకు తెగిపోయిన విద్యుత్ వైర్లను జాయింట్ చేసి విద్యుత్ సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు.

అండర్-15 క్రికెట్ జట్టులోకి కుందనశ్రీ



కుందనశ్రీని అభినందిస్తున్న డీఎస్‌డీవో బాలాజీ

చిత్తూరు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరుకు చెందిన కుందనశ్రీ ఇటీవల జరిగిన క్రికెట్ పోటీల్లో జిల్లా తరపున అండర్-15 బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జోనల్స్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం కుందనశ్రీని డీఎస్‌డీవో బాలాజీ మెమెంటోతో అభినందించారు. ఆయన మాట్లాడుతూ అండర్-15 బాలికల జట్టులో ఓపెనింగ్ బ్యాట్స్ ఉమెన్‌గా, ఆఫ్ స్పిన్ బౌలర్‌గా రాణిస్తోందన్నారు. జిల్లా టోర్నీలో బ్యాటింగ్‌లో 92 పరుగులు, బౌలింగ్‌లో 29 బంతుల్లో 6 వికెట్లు తీసి ఉత్తమ ప్లేయర్‌గా ప్రశంసలు అందుకుందన్నారు. జోనల్స్‌లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి చిత్తూరుకు మంచి పేరు తీసుకురావాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ కోచ్ జాకీర్, ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఆర్‌కండ్రిగ పాఠశాల అభివృద్ధికి

పూర్వ విద్యార్థుల విరాళం

పాలసముద్రం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఆర్‌ఆర్‌కండ్రిగ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.1,92,500లు విరాళంగా అందించారు. పూర్వ విద్యార్థి హరినాయుడు రూ.లక్షతో విద్యార్థులకు అవసరమైన వంద స్టీల్ పళ్లాలు అందించారు. ప్రధానోపాధ్యాయులు రూ.30 వేలు, పూర్వ విద్యార్థులు దేవరాజులు నాయుడు రూ. 15 వేలు, మహేంద్ర నాయుడు రూ. 10 వేలు, యుగలక్ష్మి రూ.15 వేలు, ఏయిమలై రూ.15 వేలు, విద్యా కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు రూ.5 వేలు, మహిళా పోలీస్ రూ.2,500 ఎంఈవో రాజేంద్ర ప్రసాద్, ఎంఈవో-2 గిరిజ ద్వారా దాతలు అందించారు. ఈ నగదుతో పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించుకోవాలని దాతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కుమార్, ఉపాధ్యాయులు నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సతీష్‌ను హత్య చేసింది వైసీపీ నేతలే

● టీడీపీ నేతలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సురేష్ కుమార్‌ను హత్య చేసింది వైసీపీ నేతలేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్ర కుమార్, సప్తగిరి ప్రసాద్‌లు ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు వేరు వేరుగా మీడియాతో మాట్లాడుతూ టీటీడీ పరకామణి చోరీ కేసులో కీలక సాక్షి, ఫిర్యాదుదారుడైన మాజీ ఏవీఎస్‌వో సతీష్ కుమార్‌ను అతి కిరాతకంగా హత్యచేసి రైల్వే ట్రాక్‌పై పడేశారని ఆరోపించారు. బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డిని హత్యచేసి బాత్‌రూంలో పడేసినట్లు, సతీష్ కుమార్‌ను కూడా హత్యచేశారన్నారు. సాక్షుల్ని తారుమారు చేయడం, అడ్డు తొలగించడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కల్తీ నెయ్యి, పరకామణి కేసుల్లో ఇతర సాక్షులకు కూడా వైసీపీ నేతలనుంచి ప్రాణ హాని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, మేషాక్, హేమాద్రి నాయుడు, ధరణి ప్రకాష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోటా బియ్యం దందాకు కట్టడి

● జిల్లాకు చేరిన 35 ర్యాపిడ్ కిట్లు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తే సులభంగా గుర్తించేలా ర్యాపిడ్ కిట్లను రంగంలోకి దించింది. బియ్యం పట్టుకున్న చోటే తనిఖీల కోసం సమయాన్ని వృధా చేయకుండా అప్పటికప్పుడు గుర్తించే అవకాశం ఈ కిట్ల ద్వారా సాధ్యమవుతోంది.

వైసీపీ పాలనలో చౌకబియ్యాన్ని చక్కగా కొట్టేసి నాయకులు భారీగా వెనకేసుకున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీ వ్యవస్థ కరువైంది.ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం చౌకబియ్యాన్ని క్షణాల్లో గుర్తించే విధంగా ప్రత్యేక కిట్లు అవసరమని భావించి గతవారం పంపిణీ చేసింది. చిత్తూరు జిల్లాకు ఇప్పటికే 35 కిట్లను సరఫరా చేసింది.వీటి వినియోగంపై ఇప్పటికే తనిఖీ అధికారులకు శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉప తహసీల్దార్లు, విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులకు 32 కిట్లను అందించగా పౌరసరఫరాల సంస్థ విభాగంలోని ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు కిట్లను ఇచ్చారు.

గుర్తించడం ఇలా..

పేదలకు పోషకాలను అందించేందుకు చౌకబియ్యంలో ఐరన్, బి-12, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు కలుపుతారు. సాధారణ బియ్యంలో ఇలాంటి పోషకాలు, రసాయనాలు ఉండవు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎక్కడైనా బియ్యం పట్టుకుంటే దానిలో 50 గ్రాముల బియ్యాన్ని ఒక ప్లేటులో తీసుకుని మొత్తం తడిసేలా హైడ్రోక్లోరిక్ యాసిడ్‌ను చల్లుతారు. దీనిలో పదిశాతం థియోసైనేడ్ ద్రావణాన్ని పోస్తారు. ఇలా చేసిన వెంటనే ప్రత్యేక పోషకాలున్న చౌకబియ్యం ఎరుపు రంగులోకి మారిపోతాయి. సాధారణ బియ్యం అయితే రంగుమారకుండా అలాగే కనిపిస్తాయి. ఇలా చౌకబియ్యాన్ని క్షణాల్లో గుర్తించి అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

● ఆలస్యానికి ఇక చెక్....

జిల్లాలో 1379డిపోల ద్వారా పేదలకు 8వేల టన్నుల బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో రేషన్ బియ్యం వ్యాపారం నేటికీ కొనసాగుతోంది.వీధి వ్యాపారుల నుంచి కిలో బియ్యాన్ని రూ. 13 నుంచి రూ.17 మధ్య కొనుగోలు చేస్తున్న మిల్లర్లు గోడౌన్లలో నిల్వ చేస్తున్నారు.ఇంకొందరు చౌకదుకాణ డీలర్లు ముఠాగా ఏర్పడి కార్డుదారులకు ఎంతో కొంత డబ్బులు చేతుల్లో పెట్టి నేరుగా మిల్లర్లకు బియ్యం లోడ్‌ను చేరవేస్తున్నారు. మిల్లర్ల వద్ద ఉన్నది రేషన్ బియ్యమా కాదా తేల్చేవీలు ఇంత వరకు లేదు. దీన్ని అవకాశంగా మార్చుకుంటూ మిల్లర్లు ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ర్యాపిడ్ కిట్లు అందుబాటులోకి రావడంతో ఇలాంటి అక్రమాలకు ఇక చెక్ పడనుంది.



తనిఖీల కోసం ఉపయోగించనున్న ర్యాపిడ్ కిట్

● ఘటనా స్థలంలోనే గుట్టువిప్పే అవకాశం



గతంలో బియ్యం పట్టుకున్న సందర్భాల్లో నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపించేవారు. అక్కడి నుంచి నివేదిక వచ్చి నిగ్గుతేల్చడానికి చాలా రోజులు పట్టేది. ఈ లోగా అక్రమార్కులు తెరచాటు చక్రం తిప్పేవారు. ఇప్పుడు బియ్యం పట్టుకున్న వెంటనే ద్రావకాలతో తనిఖీ చేసి నిర్ధారించే ప్రత్యేక కిట్లు గత వారం నుంచి అందుబాటులోకి వచ్చింది. దీంతో ఘటనా స్థలంలోనే గుట్టు విప్పే అవకాశం ఉంది. దీంతో అక్రమార్కులు తప్పించుకునే అవకాశం ఉండదు.

- లక్ష్మి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

బాలిరెడ్డిగారిపల్లిలో గజ బీభత్సం

● పంటలపై కొనసాగుతున్న దాడులు ● వరి, కొబ్బరి, అరటి మామిడి, టేకుచెట్ల ధ్వంసం





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట, ధ్వంసమైన పనసచెట్టు చూపుతున్న రైతు జగన్నాథరెడ్డి

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల మంద దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి వద్ద పొలాల్లో ఏనుగుల మంద బీభత్సం సృష్టించాయి. దీంతో వరి, కొబ్బరి, మామిడి, అరటి, టేకుచెట్లకు అపారనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి గురువారం రాత్రి బయలుదేరిన 16 ఏనుగుల మంద బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, తిమ్మారెడ్డికి చెందిన వరి పంటను ఏనుగుల తొక్కేశాయి. మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. పశుగ్రాసం మేసేశాయి. అక్కడి నుంచి ఏనుగుల గుంపు దేశిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గోవర్ధన్‌రెడ్డి, నాగిరెడ్డి, జగన్నాథరెడ్డి, శిద్దారెడ్డి, కృష్ణయ్యకు చెందిన మామిడి, వరి, కొబ్బరి, అరటిచెట్లను ఏనుగుల మంద ధ్వంసం చేశాయి. పనసచెట్లను నేలకూల్చిన ఏనుగుల మంద టేకుచెట్లను విరిచేశాయి. డ్రిప్ పైపులను తొక్కేశాయి. కమ్మపల్లిలోని రైతు శిద్దయ్యనాయుడుకు చెందిన టేకుచెట్లను విరిచేసిన ఏనుగులు పశుగ్రాసం మేసేశాయి. తిరిగి వచ్చిన దారిలోనే ఏనుగుల మంద అడవిలోకి చేరుకున్నాయి. శుక్రవారం పగలంతా బోడబండ సమీపంలోని ఎలకమానుపెంట వద్ద 16 ఏనుగులు సంచరించినట్లు ఎఫ్ఎస్‌వో మధుబాబు తెలిపారు.

నిరంతర సేవల కోసమే కమాండ్ కంట్రోల్ రూమ్

● ఎస్పీ తుషార్



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను శుక్రవారం ఎస్పీ తుషార్ డూడీ సందర్శించారు. సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నియంత్రణ వ్యవస్థ, ట్రాఫిక్ మానిటరింగ్ వ్యవస్థ, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ మెకానిజం వంటి అంశాలను పరిశీలించారు. సెంటర్ నెట్‌వర్క్‌కు అనుసంధానించిన ముఖ్య కూడళ్ల కెమెరాల దృశ్యాలను లైవ్‌గా పరిశీలించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మహిళలు, బాలికల రక్షణ కోసం రూపొందించిన శక్తియాప్‌లో అత్యవసర సమయాల్లో ఎస్‌వోఎస్ సంకేతం ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే కంట్రోల్ సెంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. శక్తియాప్‌లో అందించే ఎస్‌వోఎస్ సంకేతం, మహిళలు, బాలికల రక్షణ కవచంగా చేయడంతో ఎస్‌వోఎస్ సంకేతం అందగానే మహిళలు, బాలికలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. అనంతరం డయల్ 112 విభాగాన్ని పరిశీలించారు. ఈ నెంబరు ప్రజకు అత్యవసర పోలీసు, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక సేవలను అందించే అత్యంత కీలకమైన నెంబరు అన్నారు. డయల్ 112 సిబ్బంది, గస్తీ వాహన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి కాల్ ప్రాణాంతక పరిస్థితిని సూచించవచ్చన్న విషయాన్ని సిబ్బంది గుర్తించుకోవాలన్నారు. ప్రజలకు నిరంతర సేవలందించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్ ఉందన్నారు. ఏదైనా సంఘటన జరిగిన వెంటనే నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకోవడం పోలీసుల బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐలు సురేంద్ర, మోబీన్‌తాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

చిత్తూరు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. ఎప్పుడూ పాఠ్యపుస్తకాలే కాకుండా వివిధ రకాలైన పుస్తకాలను చదివి జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేది వరకు దేశవ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సరాలు జరుపుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చిత్తూరు అధ్యక్షుడు శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేణిగుంట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి మళ్లీ సస్పెన్షన్

రేణిగుంట నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆనందరెడ్డి మళ్లీ సస్పెండయ్యారు. ఈయనపై అవినీతి ఆరోపణలు రావడంతో స్టాంపుల, రిజిస్ట్రేషన్ శాఖ విచారణకు ఆదేశించింది. గత నెల అనంతపురం, నెల్లూరు జిల్లాల డీఐజీలు రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా భూములు రిజిస్ట్రేషన్ చేయడాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఆయన్ను సస్పెండు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా ఉంచడం గమనార్హం. ఇప్పటికే పలుమార్లు ఆయన సస్పెండయ్యారు.

● 2005లో ఆళ్లగడ్డలో సబ్ రిజిస్ట్రార్‌గా ఆనందరెడ్డి మొదటిసారి బాధ్యతలు స్వీకరించారు. 2007లో తిరుపతి రూరల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ చేరిన మూడు నెలలకే సస్పెండయ్యారు. దీనికి కారణం.. ఆళ్లగడ్డలో ప్రభుత్వ.. నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలపై విచారించగా వాస్తవమని తేలడమే. ● తిరిగి 2009లో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదులు అందాయి. విచారణ చేపట్టిన అప్పటి ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. ● 2010లో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన రెండు నెలల్లోపే వెస్ట్ చర్చికి సంబంధించిన స్థలాన్ని ఇద్దరికీ ఒకే రోజు.. ఒకే స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వ చలానాకు పన్నులు చెల్లించకపోవడంతో 2012లో డిస్మిషల్ ఫ్రం సర్వీస్ అయ్యారు.● మళ్లీ 2015లో తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన హయాంలో ఏసీబీ తనిఖీలు చేయగా లెక్కలో లేని సొమ్మును సీజ్ చేశారు. దీనిపై 2016లో ఆనంద్‌రెడ్డిని డిస్మిషల్ ఫ్రం సర్వీస్ చేశారు. ● తిరిగి 2020లో వైసీపీ నాయకుల అండదండలతో రేణిగుంట సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2022లో వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్లు చేయడం, రిజిస్ట్రేషన్ వేల్యూయేషన్ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నిబంధనలకు అతిక్రమించి రేణిగుంట మండలంలోని అనుగుంట ప్రాంతంలో 5 రెట్లు పెంచేశారు. వీటిపై అప్పట్లో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ● తిరిగి 2022 డిసెంబరులో ఆడిట్ సబ్ రిజిస్ట్రార్‌గా పోస్టింగ్ తెచ్చుకొని సెలవుపై వెళ్లారని విమర్శలున్నాయి. ● 2025 మార్చి 14న రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో మళ్లీ అవినీతి ఆరోపణలు రావడం, ప్రభుత్వ విచారణలో వాస్తవమని తేలడంతో మరోసారి సస్పెండయ్యారు.

వరి పొలంలో కొండచిలువ



రామకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ రెడ్డివానిపోడుకు చెందిన రైతు మునస్వామి వరి పొలంలో కూలీలు వరిపైరును కోస్తుండగా భారీ కొండచిలువ గుర్తించారు. కూలీలు భయంతో అక్కడి నుంచి పరుగులు తీయడంతో రైతులు చాకచక్యంగా పొలంలో నుంచి కొండచిలువను బయటకు తీసి సమీపంలోని అడవిలో వదిలేశారు. సుమారు 15 అడుగుల పొడవు ఉన్న కొండచిలువను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎగబడ్డారు.

వంగసానివారిపల్లెలో ఏనుగుల సంచారం

సోమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ఆవులపల్లె పంచాయతీ వంగసానివారిపల్లెలో శుక్రవారం ఏనుగులు సంచరించాయి. గురువారం రాత్రి కొత్తూరు అటవీ ప్రాంతం నుంచి వంగసానివారిపల్లె మీదుగా మూడు ఏనుగులు పొలాల వైపు పోవడం రైతులు గుర్తించారు. కలమందవారి చెరువు వద్ద ఉన్న వరి, మామిడి తోటల్లో తిరగాడి చౌడేపల్లె మండలం చుక్కావారిపల్లె అడవి వైపు వెళ్లాయని రైతులు తెలిపారు. గతంలోనూ కలమందలవారి చెరువు వద్దనే ఏనుగులు మకాం వేసి పంటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు.

సహకార రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

● డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అడుగులు వేయాలని డీసీసీబీ సీఈవో శంకర్ బాబు పిలుపునిచ్చారు. బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణంలో 72వ అఖిలభారత సహకార వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించిన సీఈవో సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మనిర్భర్ సాధకాలు- సహకార సంఘాలు అనే అంశంపై వారోత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. అందరి కోసం ఒకరు - ఒకరి కోసం అందరు అనేదే సహకార మౌలిక భావన అన్నారు. సహకార వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తించిన కేంద్రం హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సహకార కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. ఎస్ఎస్ఏ ఏపీవో, చిత్తూరు డీఎల్‌సీవో వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో 75 సింగిల్ విండోలను డిజిటలైజేషన్ చేసి వాటిద్వారా అన్ని సేవలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జీఎం లిల్లీ కేథరిన్, డీజీఎం వెంకటాచలపతి, ఏజీఎం సురేష్ బాబు, చీఫ్ మేనేజర్(లీగల్) గంగిరెడ్డిలతో పాటు బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీడినెల్లూరు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు వీరే?

వెదురుకుప్పం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, కార్యవర్గ కమిటీని ఎంపిక చేసినట్లు సమాచారం. పాత, కొత్త అధ్యక్షుల నియామకంతో కసరత్తు పూర్తయింది. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే వీఎం థామస్ ప్రకటించి, ఆదివారం పెనుమూరులో ప్రమాణస్వీకారం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వెదురుకుప్పం మండల టీడీపీ అధ్యక్షుడిగా పి. మోహన్ మురళి, పెనుమూరుకు పెద్దినేని రుద్రయ్యనాయుడు, గంగాధర నెల్లూరుకు స్వామిదాస్, పాలసముద్రానికి తాళ్లూరు శివ నాయుడు, శ్రీరంగరాజపురానికి గంధమనేని జయశంకర నాయుడు, కార్వేటినగరం మండల పార్టీ అధ్యక్షుడిగా చెంగల్రాయయాదవ్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది.దీంతో వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లో మినహా మిగతా మండలాల్లో పాత వారికే అవకాశం కల్పించినట్లయ్యింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఘనంగా బాలల దినోత్సవం



బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెలోని ఢిల్లీ పాఠశాలలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన


విజలాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు


బైరెడ్డిపల్లె: విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ డేగల ప్రభాకర్


సోమల: వడ్డిపల్లె పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు


సదుం: పరుగు పందెంలో పాల్గొంటున్న విద్యార్థులు


చౌడేపల్లె: చారాలలో బహుమతులు అందుకున్న విద్యార్థులు

చౌడేపల్లె, రొంపిచెర్ల, సోమల, సదుం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. చౌడేపల్లె మండలం చారాల హైస్కూల్‌లో హెచ్‌ఎం రేణుక ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. సోమల మండలం వడ్డిపల్లె, సోమల పాఠశాలల్లో విద్యార్థులకు బహుమతులను అందించారు. సదుం ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలను నిర్వహించారు.

● **రామకుప్పం:** రామకుప్పం మండలంలో పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విజలాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, సాగునీటి సంఘం చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** లక్కనపల్లెలోని ఢిల్లీ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్, పలమనేరు రూరల్ సీఐ పరశురాముడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. హెచ్‌ఎం రవికుమార్ పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు నార్తు పాఠశాలలో బాలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వ కృషి


పదోన్నతి పొందిన ధ్రువీకరణ పత్రాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సింగిల్ విండో చైర్మన్ ధనంజయనాయుడు, సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో శుక్రవారం సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పనిచేస్తున్న 37 మందికి ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు తమ విధులను సక్రమంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. సర్పంచ్ రాణెమ్మ, ఉప సర్పంచ్ ప్రభాకర్, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, మల్లీశ్వరి, శిరీష, టీడీపీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యల్లమ్మకు విశేష పూజలు



కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల-కల్లూరు రోడ్డు వగళ్లవారిపల్లి బస్టాపు సమీపంలో కొలువైన యల్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం అభిషేక వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతురాలైన యల్లమ్మ తల్లి భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. వేడుకల ఉభయదారులుగా కమ్మపల్లికి చెందిన లత కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



సోమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం బురుజుపల్లెలో కొలువుదీరిన శ్రీవారి ఆలయంలో శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈ నేపథ్యంలో ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణ మండపాన్ని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను అధిష్ఠింప చేసి అర్చకులు వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా చేపట్టారు. కల్యాణోత్సవ ఉభయదారులుగా రమేశ్‌నాయుడు, శ్రీమతి దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. మాజీ సర్పంచులు డాక్టర్ వెంకట్రామయ్య, కొల్లా హరిప్రసాద్, గల్లా బాలు, వెంకట్రామనాయుడు, పురుషోత్తంనాయుడు, బాలాజీ నాయుడు, జయచంద్ర, ప్రకాశ్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు, కరణం వాసు, ధనుంజయ, భానుప్రకాశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన వ్యా రచన పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, దాము, గ్రంథాలయాధికారి సత్యవాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● **వికోట:** గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జనకు కేంద్రాలని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విద్యావతి అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు చలపతి, దేవరాజ్, సిబ్బంది మోహ్మద్ వహబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు



సదుం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన నాయకుల సమష్టి కృషితోనే డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు సాధ్యమని మండల దళిత సంఘ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం దళిత, బహుజన నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బడుగు, బలహీన, దళిత, బహుజన వర్గ నాయకులందరూ ఐకమత్యంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటస్వామి, సంఘ నాయకులు శ్రీనివాసులు, సీతాపతి, రాజన్న, వెంటకనారాయణ, శ్రీరాములు, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ


దాతలు అందించిన క్రీడా దుస్తులతో విద్యార్థులు

గంగవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీయల్‌ఎస్ ఫారం హైస్కూల్ లో గణిత శాస్త్రం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రమ విద్యార్థులకు ఉచితంగా క్రీడా దుస్తులను, వంట మనుషులకు మిక్సీని బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దాత సహకారంతో సైకిల్‌షెడ్ నిర్మాణం



చౌడేపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పూర్వవిద్యార్థి అందించిన రూ.లక్ష సహకారంతో సైకిల్ షెడ్ నిర్మించినట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. శెట్టిపేట పంచాయతీ కొత్తపల్లెకు చెందిన సదాశివరెడ్డి 2007-08 విద్యా సంవత్సరంలో మేకలచిన్నేపల్లె హైస్కూల్‌లో పదో తరగతి చదువుకున్నాడు. రూ.లక్ష సాయం అందించడంతో దాత సదాశివరెడ్డిని శుక్రవారం ఉపాధ్యాయులు, పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగమూర్తి, గోవింద్, రామకృష్ణ, విజయశ్రీ టీడీపీ నాయకులు నారాయణరాజు పాల్గొన్నారు.

అమరనాథరెడ్డికి సన్మానం


ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసిన అంగన్‌వాడీ కార్యకర్తలు

పలమనేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం మిని అంగన్‌వాడీ కార్యక్తలను ప్రధాన అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి కల్పించడంపై ఎమ్మెల్యేను కలిసి ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీడీపీవోలు ఉమారాణి, అరుణశ్రీ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు జ్యోతి, శాంతి, సూపర్‌వైజర్లు మధులత, గీతమ్మ, లత, నజ్మా, సునీత, కల్పన, స్వర్ణలత, రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న శ్రీజ మిల్క్ సంస్థ ప్రతినిధి

కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీజ సంస్థ కుప్పం పరిధిలోని పలు పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. రాళ్లబూదుగూరు, సి.బండపల్లె, 64 పెద్దూరు ఉన్నత పాఠశాలలో 180 మంది పిల్లలకు సంస్థ పీబీహరి చేతుల మీదుగా విద్యా సామగ్రి అందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుంగనూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎస్పీడీసీఎల్ ఏఈ ధనంజయరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈడిగపల్లె, నక్కబండ, బండ్లపల్లె, సుగాలిమిట్ట, చంద్రమాకులపల్లె గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

కుప్పం తెలుగు యువత అధ్యక్షుడిగా కనకరాజు



కుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల తెలుగు యువత అధ్యక్షుడిగా చెత్తనత్తం పంచాయతీ కూనూరు గ్రామ టీడీపీ యువ నాయకుడు కనకరాజును నియమిస్తూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం ప్రకటించారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడు, సహకరించిన పీఎంకే ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబుకు, మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, ఇతర నేతలకు కృతజ్ఞతలు తెలిపాడు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న డీసీసీబీ మేనేజర్ హాసియా బేగం

సోమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని సింగిల్ విండో అధ్యక్షుడు పీవీ శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఖాతాదారుల సమావేశంలో చౌడేపల్లె డీసీసీబీ మేనేజర్ హసియా మాట్లాడుతూ సహకార బ్యాంకు నుంచి తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రుణాలు తీసుకున్నవారు ఇచ్చిన గడువు లోపు తిరిగి చెల్లించాలని సూచించారు. సమావేశంలో సీఈవో రెడ్డెప్ప, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, ఖాతాదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ

పుంగనూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుంగనూరు సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ కోరారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తులసీరామ్, ఎస్ఐ వెంకటరమణ, న్యాయవాది తోట గిరిధర్, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటపతి, రెడ్డెప్ప, రామలింగప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం



రామకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఆలయం వద్ద, ఆలయం వెనుక ఉన్న త్రిమూర్తి, నవగ్రహ, రాశీ, నక్షత్ర వనాల్లో దీపాలను వెలిగించారు. వేలాది దీపాల వెలుగులతో వనాలు ప్రకాశించాయి.



మాలమహానాడు మహాసభను విజయవంతం చేయండి


విలేకరులతో మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్

పుంగనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈనెల 16న ఆదివారం జరిగే మాలమహానాడు మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మహాసభలో ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ విధానానికి వ్యతిరేకంగా చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘనాయకులు శ్రీనివాసులు, గంగా, ఏడూరు శ్రీనివాసులు, భాస్కర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పుంగనూరు కోనేటి సంప్రోక్షణ



కోనేటిలో సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ కోనేరులో శుక్రవారం రాత్రి హిందూజాగరణ సమితి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ, రుద్రహోమం ఘనంగా జరిగింది. ఈఏడాది కోనేరులో ఓ వ్యక్తి మృతి చెందడంతో కార్తీకమాసంలో కార్తీక దీపోత్సవాలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో భక్తులు, యువకులు 17న సాయంత్రం సోమవారం కార్తీక దీపోత్సవ ం నిర్వహించాలని నిర్ణయించారు. శుక్రవారం సంప్రోక్షణ కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పరమేశ్, త్రిమూర్తిరెడ్డి, హరి, గంగాధర్, సాయి, హర్ష భక్తులు పాల్గొన్నారు.

నేడు అగస్తీశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం

పుంగనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నెక్కొంది పంచాయతీ అగస్తీశ్వరస్వామి కొండపై వెలసిన ప్రసన్న పార్వతీదేవి సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ పుష్కరిణిలో శనివారం సాయంత్రం వైభవంగా తెప్పోత్సవం జరుగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో శివపార్వతులకు శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల పంచామృతాభిషేకాలు



చౌడేపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతికరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సౌందర్య లహరి పారాయణం



సౌందర్యలహరి పారాయణం చేస్తున్న మహిళలు, అలంకరణలో వైష్ణవిదేవి

చౌడేపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో శుక్రవారం సౌందర్య లహరి పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మి సరస్వతి ఆధ్వర్యంలో మహిళలు సౌందర్య లహరి, ఖడ్గమాల, రుద్ర పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆహారపు అలవాట్లను అదుపులో ఉంచుకోవాలి


బైరెడ్డిపల్లె: తీర్థంలో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

పలమనేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేడు సమాజంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడానికి ఆధునిక ఆహారపు అలవాట్లు, తగిన శారీరక వ్యాయామం లేకపోవడమే ప్రధాన కారణమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి జయశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో మధుమేహ వ్యాధిపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్ నందీశ్వరయ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బెనర్జీ, డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, డాక్టర్ శశికళ, డాక్టర్ వెంకటేసు బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** మండలంలోని తీర్థం గ్రామంలో మధుమేహం నివారణపై శుక్రవారం పీహెచ్‌సీ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, హెచ్‌ఎం లక్ష్మీపతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● **గంగవరం:** షుగర్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని అవయవాలు ఒక్కొక్కటిగా పాడయ్యే ప్రమాదం ఉందని పలమనేరు నియోజకవర్గ ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) అధ్యక్షులు డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రోగులకు ఉచిత షుగర్ పరీక్షలను ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రాజారెడ్డి పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రైవేటు బస్టాండ్ వద్ద వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు అభిషేకాలు, అర్చనలు చేశారు.

వైభవంగా గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం


అలంకరణలో గంగమ్మ

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం జీడిమానపల్లెలో కొత్తగా నిర్మించిన గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం వేదపండితులు వివిధ హోమాలు నిర్వహించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య కలశస్థాపన, అమ్మవారి మూల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సీఎం చంద్రబాబు తరపున అమ్మవారికి సారె సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు కుంభాభిషేక అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.


చంద్రబాబు తరపున అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్సీ కంచర్ల

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

పలమనేరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15వ తేదీన శనివారం పలమనేరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పలమనేరు అర్బన్, రూరల్ మండలంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పలమనేరు ఏడీఈ జీవన్‌కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి అన్నారు. బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం స్థానిక గిరింపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ చిన్ననాటి నుంచి పిల్లల్ని అన్ని విధాలా కాపాడాల్సిన బాధ్యత అటు తల్లిదండ్రులతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాల్యవివాహాలు, భిక్షాటన, బాల కార్మికులను గుర్తించి, వాటి నుంచి విముక్తి చేసి, విద్యవైపు నడిపించాలన్నారు. ఇందుకోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబరు అందుబాటులో ఉందన్నారు. అంతకు ముందు చిన్నారులు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం మోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, ప్రొబెషన్ అధికారి లక్ష్మీపతి, బాలల సంరక్షణాధికారి డాక్టర్ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యాసామగ్రిని వితరణ చేస్తున్న ఎలైట్ సభ్యులు తదితరులు

చిత్తూరు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ చిత్తూరు ఎలైట్ సభ్యులు విద్యార్థులకు విద్యాసామగ్రిని వితరణ చేశారు. తపోవనం వృద్ధాశ్రమం, పాఠశాలలో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి, పిల్లల చేత కేక్ కట్ చేయించారు. అనంతరం తపోవనంలో చదువుతున్న విద్యార్థులందరికి విద్యాసామగ్రిని, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ చిత్తూరు ఎలైట్ అధ్యక్షుడు సీఏ సుమంత్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ అశోక్, కోశాధికారి గురుగణేష్, ప్రముఖులు గోవర్ధన్, పార్థసారథి నాయుడు, సుబ్రమణ్యం, డాక్టర్ దినేష్, పాఠశాల హెచ్‌ఎం గజలక్ష్మి, విశాంత్ర హెచ్‌ఎం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మధుమేహంపై అందరికీ అవగాహన అవసరమని చిత్తూరు డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. శుక్రవారం ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చునన్నారు. ప్రతిరోజు తినే ఆహారంలో పీచు పదార్థం ఉండేలా చూసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, నడక, యోగా, ధ్యానం, గేమ్స్ లాంటివి తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించుకుంటే అదుపులో మధుమేహం



మధుమేహం గురించి తెలియజేస్తున్న ఐరాల ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది

ఐరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ బరువును అదుపులో ఉంచుకుని ఒత్తిడిని తగ్గించుకుంటే మధుమేహం అదుపులో ఉంటుందని ఐరాల పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డెప్ప సూచించారు. శుక్రవారం ఆస్పత్రి సిబ్బంది, ఆశావర్కర్లతో ఐరాలలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం ఏ వయసు వారికైనా వస్తుందన్నారు. 30 సంవత్సరాలు పై బడిన వారందరూ 3 నుంచి 4 నెలలకు ఒక్కసారి మధుమేహ పరీక్షలు చేయించుకుంటే మంచిదన్నారు. డయాబెటిస్‌ను ప్రీ డయాబెటిక్ స్టేజ్‌లో గుర్తిస్తే తగిన మందులను వాడి ఇబ్బందులు రాకుండా చూడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ చిన్నమ్మ, మేల్ హెల్త్ అసిస్టెంట్ మునిరత్నం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వెదురుకుప్పం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శుక్రవారం కార్వేటినగరంకు చెందిన ఏఆర్‌భూపాల్, జయంతి వితరణతో అన్నదాన కార్యక్రమం జరిగింది. వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ సూపర్‌వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది

చిత్తూరు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయడానికి రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ అధికారి విష్ణుచరణ్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చిత్తూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం బ్యాంకు కార్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ గౌరవ కార్యదర్శి సహదేవనాయుడు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరిలో అంబరాన్నంటిన బీజేపీ సంబరాలు



నగరి, నవంబరు 14(ఆంధ్ర జ్యోతి): బిహార్‌లో ఎన్‌డీఏ కూటమి అఖండ విజయంతో బీజేపీ నేతలు నగరి బస్టాండ్ కూడలి వద్ద వైభవంగా సంబరాలు నిర్వహించారు. టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ బిహార్ ప్రజల హృదయాలను మోదీ, నితీష్‌కుమార్, చిరాగ్ పాశ్వాన్ గెలిచారన్నారు. నగరి పట్టణ టీడీపీ అధ్యక్షులు గుణ, దేశమ్మ ఆలయ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీజేపీ నేతలు వేలాయుధం, రామ్మూర్తి, మునికృష్ణ నాయుడు, హరి, మురుగానందం, మీరా, కాంచన, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

● శ్రీరంగరాజపురం (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఘన విజయం సాధించడంతో ఎస్‌ఆర్‌పురం మండలంలో నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జ్యోతిరెడ్డి, నాగరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడి అరెస్టు



వసంత్ కుమార్ (ఫైల్ ఫొటో)

యాదమరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాచిగుంట గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఈశ్వర్ కథనం మేరకు... గతేడాది డిసెంబర్‌లో పాచిగుంట గ్రామానికి చెందిన కీర్తన అనే వివాహిత గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కీర్తనను అదే గ్రామానికి చెందిన వసంత్ కుమార్ నిత్యం మానసికంగా వేధించడం వల్లే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వసంత్ కుమార్‌పై కేసు నమోదైంది. అప్పటి నుంచి వసంత్ కుమార్ తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓటేరుపల్లి క్రాస్ వద్ద నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు.

గ్రానైట్ తరలిస్తున్న లారీల స్వాధీనం



బంగారుపాళ్యం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో సంక్రాంతిపల్లె వద్ద సీఐ కత్తిశ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేపడుతుండగా పుంగనూరు నుంచి ఒంగోలుకు గ్రానైట్ తరలిస్తున్న రెండు లారీలను అదుపులోకి తీసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ లారీలను బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌కు తరలించి, చిత్తూరు గనుల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో జారి పడి వృద్ధుడి మృతి

చిత్తూరు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించిన ఓ వృద్ధుడు కిందపడి మృతి చెందాడు. రెండవ పట్టణ ఎస్ఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. కట్టమంచికి చెందిన నటరాజన్(63) ప్రభుత్వ కార్యాలయాల వద్ద అర్జీలు రాసేవారు. కొంత కాలంగా మద్యానికి బానిసవ్వడంతో భార్య, కుటుంబ సభ్యులు వదిలేశారు. దాంతో రోజంతా అర్జీలు రాసిచ్చి వచ్చిన డబ్బులతో మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ ఉండిపోయేవాడు. ఈ క్రమంలో గురువారం నటరాజన్ ఫుల్లుగా మద్యంతాగి ఎల్‌జీబీ టవర్స్ పక్కనే ఉన్న ఓ గోడపై పడుకున్నాడు. మద్యం మత్తులో కిందకు జారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ గోవిందశెట్టి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

యువతి అదృశ్యం



అదృశ్యమైన కళావతి

బంగారుపాళ్యం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన షణ్ముగం కుమార్తె కళావతి (30) గురువారం నుంచి కనబడటం లేదని, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ కనబడకపోవడంతో శుక్రవారం బంగారుపాళ్యం పోలీసులకు ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిల్లలకు శుచి, శుభ్రతతో వడ్డించండి

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు శుచి, శుభ్రతతో రుచికరమైన భోజనాన్ని అందించాలని విద్యాకమిటీ చైర్‌పర్సన్ టీఆర్ ఢిల్లీబాయి, ఎంఈవో గణపతి అన్నారు. శుక్రవారం మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం వంటలు వండి అందించాలన్నారు. హెచ్‌ఎం దుర్వాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, గురుమూర్తి పాల్గొన్నారు.

నడక దారిని కాపాడండి

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే దారిని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకుని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లె గ్రామం నుంచి రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఉన్న దారి లేదంటూ ఓ వ్యక్తి ఆక్రమణకు గురిచేస్తున్నాడని, మరొకరు చెరువును ఆక్రమించి పంటలు పండిస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోక పోవడంతో రైతులు తమ పొలాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి సర్వే చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు 11 వినతులు

చిత్తూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు 11 వినతులు వచ్చాయి. స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటికప్పుడు పరిష్కరించదగిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రమణ, హౌసింగ్ డీఈ శ్రీధర్, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజు, నేతలు నరేష్, గోపాలక్రిష్ణ, లీలావతి, సుబ్రి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి అనుగ్రహం అపారం



పూజలు చేస్తున్న ప్రతాప్‌స్వామి

వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సిద్ధేశ్వరస్వామి అనుగ్రహం అపారమైందని ఏకవీర ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి అన్నారు. శుక్రవారం వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె సమీపంలోని సిద్ధేశ్వర గుహ దేవాలయంలో ప్రతాప్ స్వామి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేశారు. శివలింగానికి అభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త బట్టే చాణిక్యప్రతాప్, కార్య నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

వెదురుకుప్పం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి భావిభారత భాగ్యవిధాతలని కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాదమునిరెడ్డి అన్నారు. శుక్రవారం కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను విజేతలకు హెచ్‌ఎం అందజేశారు. డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హ్యాపీ చిల్డ్రన్స్ డే ఆంగ్ల అక్షరక్రమాన్ని త్రివర్ణ రంగులతో విద్యార్థులు చేసిన అక్షరమాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు సరస్వతి, కలైవాణి, రవి, రాములు, కిషోర్‌కుమార్, రంజిత్‌కుమార్, బొజ్జా రాము, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి సర్వే ఇంటింటా చేయాలి

చిత్తూరు సిటీ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి ఇంటింటా సర్వేని ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని పూతలపట్టు ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. శుక్రవారం పీహెచ్‌సీలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో నరసింహప్రసాద్, హెచ్ఎస్ ధర్మేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అర్హులందరూ

సద్వినియోగం చేసుకోవాలి



మండల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

విజయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంజు బాలాజీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డు ఉండి గ్యాస్ కనెక్షన్ లేని వారు ఉజ్వల పథకానికి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఉచితంగా కనెక్షన్ మంజూరు చేస్తుందన్నారు. చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల మేర గ్రామాలు లేవని తీర్మాణం చేసి మహారాజపురంలో యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్నారని బూచివానత్తం ఎంపీటీసీ రాజగోపాల్ ఆరోపించారు. భూ సమస్యలపై వాజ్యాలు కోర్టులో నడుస్తుంటే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలకు లోబడి, రెవిన్యూ పరిధిలో మాత్రమే పనులు చేస్తున్నామని స్పష్టం చేశారు. సబ్సిడీ పెసలు, ఉద్దులు రైతులకు సకాలంలో అందలేదని సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు. కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబు యాదవ్, కోఆప్టెడ్ మెంబరు రాజేంద్ర సమస్యలపై ప్రశ్నించారు. ఆయుష్మాన్ భారత్ కార్డు జనరేట్ చేయడానికి గ్రామాల్లో ఆశా కార్యకర్తలు పట్టించుకోవడం లేదని, ప్రాథమిక వైద్యాధికారి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు ఫిర్యాదు చేశారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, ఏవో రజినీకుమారి, సీడీపీవో ఇందిర ప్రియదర్శిని, వైద్యాధికారి వనజ, ఏఈలు వీరభద్రం, గిరీష్‌కుమార్, ఏలుమలై, వైస్ ఎంపీపీ కనెమ్మ, ఎంపీటీసీ అంబిక, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కార్యవర్గ ప్రమాణస్వీకారం



నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

బంగారుపాళ్యం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): పార్టీ ఆశయాలకు అనుగుణంగా కలిసి పని చేద్దామని నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీలకు టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మీ కల్యాణ మండపంలో జరిగిన మండల అధ్యక్షుడి, గ్రామకమిటీ, క్లస్టర్ ఇన్‌చార్జుల ప్రమాణ స్వీకారోత్సవం పండుగను తలపించింది. అంతకుముందు మండల అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్‌లు మొగిలి గ్రామంలో కామాక్షి సమేత మొగిలీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా తరలివచ్చి శేషాపురం వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమావేశ మందిరానికి చేరుకుని నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీలతో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ ప్రమాణం చేయించారు. నూతనంగా ఎన్నుకోబడ్డ కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ అమరావతి, తవణంపల్లె, ఐరాల, యాదమరి, పూతలపట్టు మండలాల అధ్యక్షులు నూతన కమిటీ సభ్యులను పూలమాలలు, దుశ్శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ గౌడ్, హేమచంద్ర నాయుడు, లోకేష్‌రెడ్డి, రమేష్, గిరిబాబు, హరిప్రసాద్, కమలనాథరెడ్డి, చిన్నెయ్య, గజేంద్ర, మంజునాథ్, సూరి నాయుడు, నాగరాజగౌడ్, ఎన్పీ పృథ్వీ, నవీన్ చౌదరి, శ్రీనివాసులు నాయుడు, దొరబాబు, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భావితరాలకు ప్రయోజకులు కావాలి



మాట్లాడుతున్న విజయం స్కూల్ ప్రిన్సిపాల్ శైలజామూర్తి



దేశనాయకుల వేషధారణలో న్యూయార్క్ చిన్నారులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిని భావితరాలకు ప్రయోజకులుగా చేయడమే విజయం విద్యాసంస్థల లక్ష్యమని ఆ సంస్థల సీబీఎస్ఈ ప్రిన్సిపాల్ శైలజామూర్తి అన్నారు. స్థానిక విజయం సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో శైలజామూర్తి మాట్లాడుతూ చిన్ననాటి నుంచి దేశభక్తి, తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చడం, నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడమే విద్యార్థుల ప్రథమ కర్తవ్యమన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ● జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుని దేశ ప్రయోజకులైన వారిని ఆదర్శంగా తీసుకుని చిన్నారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని న్యూయార్క్ స్కూల్ చైర్మన్ శ్రీధర్ అన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశ నాయకుల వేషధారణలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ● పీవీకేఎన్‌లో ప్రతిభ కనపరచిన ఇద్దరు విద్యార్థులకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతిని కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అందజేశారు. కళాశాలలో విద్యలో ప్రతిభ, క్రమశిక్షణ, సహపాఠ్య కార్యక్రమాలలో థర్డ్ బీకాం విద్యార్థి పూర్ణచంద్రారెడ్డి, సెకండ్ బీఎస్సీ విద్యార్థిని సీమ్ ముబీన్‌కు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతి అందజేశారు.

ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చినబాబుకి సన్మానం



చినబాబుని పూలమాలతో సన్మానిస్తున్న నగరి మున్సిపల్ టీడీపీ నాయకులు

నగరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌గా నియమించబడిన చినబాబును శుక్రవారం నగరి మున్సిపల్ టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసే చినబాబుకు రాష్ట్ర స్థాయిలో పదవి ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాసన్, అశోక్‌రాయల్, మనీ, రాజా పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి పుస్తకాల అందజేత



కొల్లాగుంటలో విద్యార్థులకు నీతి పుస్తకాలిస్తున్న పైనేని మురళి

వెదురుకుప్పం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 200 మందికి నీతి పుస్తకాలను తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కోశాధికారి పైనేని మురళి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, ఎంఈవో గణపతి అన్నారు. శుక్రవారం మండలంలోని నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరచిన వారికి జీజేఎం ట్రస్టు ద్వారా బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం దుర్వాసులు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ టీఆర్ ఢిల్లీబాయి, టీడీపీ నాయకులు ధనసింగ్, బాలసుబ్రహ్మణ్యంయాదవ్, హరి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

నగరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని నెత్తం కండ్రిగ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీటీ ట్రస్టు హెచ్‌డీ ఫౌండేషన్ వారు విద్యార్థిని, విద్యార్థులకు రంగవల్లికలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బుగ్గ కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రవీంద్రబాబు బాలలకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. విజయపురం గ్రామానికి చెందిన ఆర్.భాస్కర్‌రాజు విద్యార్థులకు విద్యాసామగ్రి అందించారు. నారాయణ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



ముత్తయ్య అనే కరుణను సన్మానించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మొదలియార్ కార్పొరేషన్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన నగరి పట్టణ పరిధిలోని సత్రవాడకి చెందిన ముత్తయ్య అనే కరుణను ఎమ్మెల్యే భానుప్రకాష్ శుక్రవారం సన్మానించారు. పార్టీలో కష్టించి పని చేసే వారికి తగిన స్థానం కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరి మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాస, నాయకులు మాణిక్యవాసన్, రాజా, లోకేష్, అశోక్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో డిప్యూటీ సీఎం ఓఎస్డీ



మధుసూదన్‌రావుకు జ్ఞాపిక అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్డీ మధుసూదనరావు కుటుంబ సమేతంగా శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈవో రవీంద్రబాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



డీడీని అందిస్తున్న దాత

ఐరాల (కాణిపాకం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు తిరుపతికి చెందిన వెంకట కుమార్ రూ.1,01,116 డీడీ రూపంలో శుక్రవారం అందించారు. విరాళదాతను ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్న చిన్నెయ్య

బంగారుపాళ్యం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నలగాంపల్లె ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఆ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిన్నెయ్య విద్యాసామగ్రిని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కుసుమకుమారి, క్రిష్ణమూర్తి, చిట్టిబాబు, దేవదాసు, వెంకటేష్, కిషోర్, సూర్య పాల్గొన్నారు.

పుస్తక పఠనానికి సమయం కేటాయించండి

బంగారుపాళ్యం, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): రోజూ పుస్తక పఠనానికి సమయం కేటాయించుకోవాలని ఎంఈవో నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జరిగిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సరస్వతీదేవి, నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఎంఈవో-2 రమేష్‌బాబు, ఉపాధ్యాయులు క్రిష్ణయ్య, రామక్రిష్ణ, సీఆర్‌పీ సుశీల, విశ్రాంత ఉపాధ్యాయుడు జోహార్, గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

19న కార్వేటినగరంలో జాబ్ మేళా

వెదురుకుప్పం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయలురెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.